ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శుక్రవారం 3 జనవరి 2025



8న దిశా సమావేశం

పార్వతీపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం ఈ నెల 8వ తేదీన జరగనుందని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి బీవీ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో అరకు పార్లమెంట్ సభ్యులు గుమ్మ తనూజారాణి అధ్యక్షతన ఉదయం 11 గంటల నుంచి సమావేశం జరుగుతుందని తెలిపారు. కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

- అటవీ ఉత్పత్తుల విక్రయానికి గిరిజనుల పాట్లు
- కొనుగోలు చేయని జీసీసీ
- వ్యాపారులకు అమ్మితే కేసులు నమోదు చేస్తున్న అటవీశాఖ
- బతికేదెలా అంటున్న అడవి బిడ్డలు
- సమస్యను పరిష్కరించాలని అధికారులకు విన్నపం

వారు కొనరు.. వీరు అమ్ముకోనివ్వరు



సీతంపేట వారపు సంతకు తెచ్చిన కొండచీపుర్లు



వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో కొండచీపుర్లను ఆటోలో ఇంటికి తరలిస్తున్న గిరిజనులు

సీతంపేట రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో గిరిజన రైతులు వింత పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఒకపక్క ఆరుగాలం కష్టపడి సేకరించిన గిరిజన ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధరను జీసీసీ (గిరిజన సహకార సంఘం) కల్పించకపోగా, మరోపక్క ఉన్న అటవీ ఉత్పత్తులను విక్రయించేందుకు అటవీశాఖ అభ్యంతరాలు చెబుతోంది. దీంతో గిరిజన రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

కొండచీపుర్లను కొనట్లే..

సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది పొడవునా గిరిజన రైతులకు లాభాన్ని తీసుకువచ్చే పంట ఏదైనా ఉంది అంటే అది కొండచీపుర్లే. మన్యం ప్రాంతంలో సుమారు 6 వేల ఎకరాల్లో ఈ పంటను గిరిజనులు సాగుచేస్తున్నారు. ఈ కొండచీపుర్లు తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని విజయవాడ, రాజమండ్రి, ఏలూరు, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం వంటి పట్టణాలకు ఎక్కువగా సరఫరా అవుతాయి. వ్యాపారులు సీతంపేట, దోనుబాయి, మర్రిపాడు, కుసిమి, పూతికవలసలో జరిగే వారపు సంతలకు వేల సంఖ్యలో కొండచీపుర్లను కొనుగోలు చేసి తీసుకుపోతారు. ఇంత వరకు బాగానే ఉన్న గత నెల రోజులుగా మైదాన ప్రాంత వ్యాపారులు కొండచీపుర్లను గిరిజన రైతుల నుంచి కొనుగోలు చేయడం మానేశారు. కొండచీపుర్లను తరలిస్తున్న వాహనాలపై అటవీశాఖ అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేయడంతో పాటు రూ.లక్షల్లో అపరాధ రుసుం వసూలు చేస్తుండడంతో వ్యాపారులు హడలిపోతున్నారు. అంతేకాకుండా సీతంపేట ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న వన్‌ధన్ వికాశ కేంద్రాల(వీడీవీకే)ద్వారా కొనుగోలు చేసిన కొండచీపుర్లను సైతం రవాణా చేయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారు. గత నెల రోజులుగా (మిగతా 8వ పేజీలో...)

చోద్యం చూస్తున్న జీసీసీ

గిరిజన అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాల్సిన జీసీసీ చోద్యం చూస్తోంది. సీతంపేట ఏజెన్సీలో గిరిజన రైతులు పండించే అటవీ ఉత్పత్తుల్లో ప్రధానమైనవి కొండచీపుర్లు, నరమామిడి చెక్క, పసుపు, చింతపండు, నల్ల జీడిపిక్కలు, కుంకుడుకాయ లు, తానికాయలు, చింతపిక్కలు, ఎండు ఉసిరి పప్పు, ముషిడి పిక్కలు, ఇండుగు పిక్కలు, కరక్కా యలు తదితర పంటలను జీసీసీ కొనుగోలు చేయాలి. అయితే, గత వైసీపీ ప్రభుత్వ హయాం లో ఆన్‌లైన్ టెండర్‌మెటల్ స్క్రాప్ ట్రేడ్ కార్పొరే షన్(ఎంఎస్‌టీసీ) విధానం ద్వారా గిరిజన ఉత్పత్తులను విక్రయించాలని ఆదేశాలు వచ్చాయి. అప్పటి నుంచి ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు జరపడంతో ఆశించిన స్థాయిలో వ్యాపారం జర గడం లేదు. ఫలితంగా అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయలేక జీసీసీ చేతులెత్తేసింది. ఇదే అదునుగా గడచిన కొన్నేళ్లుగా గిరిజన రైతుల శ్రమను మైదాన వ్యాపారులు దోచుకుంటున్నారు. మైదాన వ్యాపారుల అక్రమా లను అరికట్టాల్సిన జీసీసీ అధికారులు తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. మరోపక్క జీసీసీ డీఎం స్థానికంగా ఉండకపోవడంతో గిరిజన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 2022-23 ఏడాదిలో 1.36లక్షల కొండచీపుర్లను జీసీసీ కొనుగోలు చేయగా, 2023-24లో కేవలం 9,436 కొండచీపుర్లను మాత్రమే కొనుగోలు చేసింది.

శంబర జాతరకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ జాతరకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించే జాతరకు సంబంధించి ఏర్పాట్లపై గురువారం తన కార్యాలయంలో కలెక్టర్ సమీక్షించారు. 'జాతరను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలి. తాగునీటి సరఫరాలో అత్యంత జాగ్రత్తతతో వ్యవహరించాలి. కొరత లేకుండా చూడాలి. అవసరమైన పైపులైన్లు ముందుగా వేసి నిరంతరం సరఫరా చేయాలి. తాత్కాలిక, శాశ్వత ప్రాతిపదికన మరుగుదొడ్లు నిర్మించాలి. విద్యుత్ సరఫరాలో సరైన పర్యవేక్షణ ఉండాలి. నడక, క్యూలైన్ల మార్గాల్లో భక్తులకు ఎటువంటి ఆటంకం ఉండరాదు. వైద్య శిబిరాలు నిర్వహించాలి. ప్రజా రవాణా శాఖ తగినన్ని బస్సులను ఏర్పాటు చేయాలి. పోలీసులు బందోబస్తు, కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలి.' అని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు పోలీస్ సూపరింటెండెంట్ దిలీప్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లను సిద్ధం చేయండి

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు అందించేందుకు పౌష్టికాహార కిట్లను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ తదితర అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'జిల్లాలోని గర్భిణుల్లో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉంటుంది. ఎక్కువగా చింతపండును వినియోగించడం ద్వారా హిమోగ్లోబిన్ తగ్గే అవకాశం ఉంది. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలి. చింతపండుకు బదులుగా పులుపునిచ్చే ఇతర పదార్థాలను వంటల్లో వినియోగించాలని ప్రజలకు చెప్పాలి. అంగన్‌వాడీలు ఇచ్చే ఆహారంతో పాటు న్యూట్రీషన్ కిట్లను గర్భిణులు వినియోగించవల్ల వారిలో హిమోగ్లోబిన్ బాగా పెరుగుతుంది.'అని తెలిపారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో విజయపార్వతి, నోడల్ అధికారి ఎం.వినోద్‌కుమార్, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి వాగ్దేవి, ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ ఎల్‌పీఎం సమస్యకు చెక్

- సింగిల్ ఎల్‌పీఎంలుగా మార్చేందుకు ప్రభుత్వ నిర్ణయం
- ఉచితంగా చేయాలని ఆదేశం
- జీవో జారీ చేసిన ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ
- రైతుల్లో హర్షాతిరేకాలు



జియ్యమ్మవలస, జనవరి 2 (ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న శాశ్వత భూ హక్కు.. భూరక్ష పథకంలో భాగంగా జిల్లాలో చేపట్టిన భూ సర్వే తప్పుల తడకగా ఉన్న విషయం తెలిసిందే. అస్తవ్యస్తంగా జరిగిన ఈ సర్వేతో రైతుల సమస్యలు పరిష్కారం కాకపోగా కొత్త సమస్యలను తెచ్చిపెట్టింది. ముఖ్యంగా జాయింట్ ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎం)తో రైతులు అన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఉచితంగా సింగిల్ ఎల్‌పీఎం ఇవ్వాలని రెవెన్యూ సదస్సుల్లో వేడుకుంటున్నారు. రైతుల ఇబ్బందుల దృష్ట్యా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జాయింట్ ఎల్‌పీఎంలను సింగిల్ ఎల్‌పీఎంలుగా మార్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అది కూడా ఎటువంటి ఫీజు లేకుండా, ఉచితంగా ఈ సేవలు అందించాలని ఆదేశించింది. ఈ మేరకు జీవో ఆర్టీ నెంబరు 1ను విడుదల చేసింది. జిల్లాలో 15 మండలాల పరిధిలో 965 గ్రామాలు ఉన్నాయి. 2020 డిసెంబరు 21న రీసర్వే ప్రారంభమైంది. 304 గ్రామాల్లో 1.70 లక్షల ఎకరాలను మూడు విడతలుగా సర్వే చేశారు. దీనికిగాను 240 గ్రామ సర్వేయర్లను అప్పటి ప్రభుత్వం వినియోగించింది. ఇందులో 18,746 జాయింట్ ఎల్‌పీఎంలు నమోదు చేసింది. దీనివల్ల దాదాపు 50 వేల మందికి పైగా రైతులు బాధితులుగా మారారు. కొందరు రైతులు రూ.550 చెల్లించి దరఖాస్తు చేసుకుంటే ఆ రైతు ప్రాప్తికే ఒక మ్యాప్ వరకు సరి చేసేవారు. కొందరు వీఆర్వోలు, సర్వేయర్లు ఆమ్యామ్యాలు వసూలు చేసిన సందర్భాలు ఉన్నాయి. దీంతో రైతులు తీవ్ర అవస్థలు పడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రీసర్వే తప్పులను సరి చేసేందుకు శ్రీకారం చుట్టింది. దీనికోసం రెవెన్యూ సదస్సును నిర్వహిస్తోంది. కొందరు రైతులు రూ.500 చెల్లించి భూములను రీసర్వే చేయించుకుంటున్నారు. వారి పరిస్థితిని గమనించిన ప్రభుత్వం జాయింట్ ఎల్‌పీఎంలపై దృష్టి సారించి రైతులకు ఉచితంగా న్యాయం చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఆ శాఖ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా నూతన సంవత్సరం రోజే జీవో (మిగతా 8వ పేజీలో...)

12న యువజన ఉత్సవ్

పార్వతీపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న యువజన ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని స్థానిక లయన్స్ క్లబ్‌లో యువజన్ ఉత్సవ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు 98484 18582, 63046 37663 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సెట్విజ్ సీఈవో రాజగోపాల్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బి.ఎన్.బి.రావు, తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోగా భాస్కరరావు

పార్వతీపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ భాస్కరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఈయన ప్రస్తుతం విజయనగరం డీఎంహెచ్‌వోగా పని చేస్తున్నారు. గతంలో జిల్లా ఏడీఎంహెచ్‌వోగా విధులు నిర్వహించారు. సీతంపేట ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయపార్వతి ప్రస్తుతం జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్యశాఖగా పని చేస్తున్నారు.

మీలో ఓ సైనికుడు


- సైనిక పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 13 వరకు గడువు
- ఎన్‌టీఏ ఆధ్వర్యంలో అర్హత పరీక్ష
- ఎన్‌డీఏ లక్ష్యంగా ప్రత్యేక శిక్షణ, బోధన
- త్రివిధ దళాల్లో చేరేందుకు అవకాశం

6లో

విధి నిర్వహణలో ఆటుపోట్లు తప్పవు

- ఎన్నికలప్పుడు నా ఏడాదిన్నర కొడుకుకు పది రోజులు దూరం
- అవరోధాలను అధిగమిస్తేనే లక్ష్యాలు సాధించగలం
- ఏపీఎస్పీ 5వ బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్

6లో


గుర్రపు స్వారీ చేస్తున్న విద్యార్థినులు

మీలో ఓ సైనికుడు

- సైనిక పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 13 వరకు గడువు
- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో అర్హత పరీక్ష
- ఎన్‌డీఏ లక్ష్యంగా ప్రత్యేక శిక్షణ, బోధన
- త్రివిధ దళాల్లో చేరేందుకు అవకాశం

రక్షణ రంగంలో ఉన్నత స్థానంలో సేవలందించాలని ఉందా?... ధైర్య సాహసాలు గల వ్యక్తిగా మిమ్మల్ని మీరు ఆవిష్కరించుకోవాలని అనుకుంటున్నారా? అయితే మీకోసం సైనిక పాఠశాలలు ఎదురు చూస్తున్నాయి. మీ శక్తియుక్తులకు పదును పెట్టి... మీ ఆశయాన్ని నెరవేర్చేందుకు బాటలు వేయనున్నాయి.

విజయనగరం టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి)

దేశ రక్షణ రంగంలో చేరి మాతృభూమి రక్షణకు కృషి చేద్దామనుకునే విద్యార్థులకు సువర్ణావకాశం. ఆరో తరగతి నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యా బోధన.. ప్రత్యేక శిక్షణతో త్రివిధ దళాల్లో భాగస్వామ్య మయ్యేందుకు చక్కని అవకాశం కల్పిస్తున్నాయి సైనిక పాఠశాలలు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సైనిక పాఠశా లల్లో ప్రవేశాలకు జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. 2025 - 26 విద్యా సంవత్సరానికి 6, 9 తరగతుల్లో బాలబాలికలు ప్రవేశాలు పొందడానికి పరీక్ష నిర్వహించనున్నారు. దీనికి ఫిబ్రవరి 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు వైద్య పరీక్షల్లో ఉత్తీర్ణులు కావలసి ఉంటుంది. అక్కడ ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకోవడానికి అవకాశం లభిస్తుంది.

● మన రాష్ట్రంలో రెండు...

దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో 33 సైనిక పాఠశాలలు ఉన్నాయి. వాటిలో మన రాష్ట్రంలో రెండు ఉన్నాయి. అందులో విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక పాఠశాల ఒకటి కాగా, చిత్తూరు జిల్లా కలికిరిలో మరో సైనిక పాఠశాల ఉంది.

● అర్హతలు ఇవీ..

సైనిక పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల వయసు 2025 మార్చి 31 నాటికి 10-12 ఏళ్ల మధ్య ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదివి ఉండాలి. తొమ్మిదో తరగతిలో ప్రవేశాలకు 2025 మార్చి 31 నాటికి 13-15 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ తరగతి చదివి ఉండాలి.

● దరఖాస్తు ఇలా..

విద్యార్థులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎఐఎస్ఎస్ఇఇ.ఎన్‌టీఏ.ఎన్ఐసి.ఐఎన్.వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ధ్రువపత్రాలు, విద్యార్థి ఫొటో, సంతకం అప్‌లోడ్ చేయాలి. జనరల్, రక్షణ రంగంలో పని చేస్తున్న వారి పిల్లలకు, మాజీ సైనికోద్యోగుల పిల్లలకు ఫీజును రూ.800, ఎస్సీ, ఎస్టీలకు రూ.650గా నిర్ణయించారు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేయాలి. 14న రాత్రి 11.30 గంటలలోగా ఆన్‌లైన్, డెబిట్, క్రెడిట్ కార్డు, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, యూపీఐ ద్వారా ఫీజు చెల్లించాలి.

● ఎన్ని మార్కులకు అంటే...

6వ తరగతి వారికి 300 మార్కులకు పరీక్ష ఉంటుంది. లాంగ్వేజీ, ఇంటెలిజెన్స్, జనరల్ నాలెడ్జ్‌లో 25 ప్రశ్నల చొప్పున ఒక్కో సబ్జెక్టుకు 50 మార్కులు ఉంటాయి. గణితంలో 50 ప్రశ్నలకు 150 మార్కులు ఉంటాయి. వీరికి అన్ని ప్రాంతీయ భాషల్లో ప్రశ్నపత్రం ఉంటుంది. 9వ తరగతి వారికి 400 మార్కులకు ఆంగ్లంలోనే పరీక్ష నిర్వహిస్తారు. గణితంలో 50 ప్రశ్నలకు 200 మార్కులు, ఇంటెలిజెన్స్, జనరల్ సైన్స్, ఆంగ్లం, సోషల్ సైన్సు సబ్జెక్ట్‌ల్లో ఒక్కోదానికి 25 ప్రశ్నలకు 50 మార్కుల చొప్పున పరీక్ష నిర్వహిస్తారు.

● పరీక్ష కేంద్రాలు ఇవే..

6వ తరగతి విద్యార్థులకు పరీక్షా సమయం 2.30 గంటలు. 9వ తరగతి విద్యార్థులకు 3 గంటలు ఉంటుంది. రాష్ట్రంలోని విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం వంటి ప్రధాన కేంద్రాల్లో సైనిక పాఠశాల ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రవేశ పరీక్ష ఫలితాలు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో ఉంచుతారు.


గురి తప్పకూడదు: షూటింగ్‌లో శిక్షణ పొందుతూ..



కోరుకొండ సైనిక పాఠశాల ప్రధాన గేటు


విద్యార్థుల పరేడ్

పోషకాల తోట-శాల!

- వంగర కేజీబీవీలో కూరగాయల పెంపకం
- ప్రభుత్వ ఆదేశాలతో ముందుకు
- ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషితో పంటలు


తోట పనిలో సిబ్బంది

వంగర, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో న్యూట్రీ గార్డెన్లు పెంచాలంటూ ప్రభుత్వం ఇటీవల విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. దీనిని ఆచరిస్తే అద్భుతాలు సృష్టించవచ్చునని తెలిపింది. క్షేత్రస్థాయిలో వీటిని పండించడం ద్వారా విద్యార్థులకు పోషకాహారం అంది.. అనారోగ్య సమస్యలను అధిగమించవచ్చు ననేది దీని ఉద్దేశం. దీంతో వంగర కేజీబీవీ పాఠశాలలోని ఖాళీ స్థలంలో విద్యార్థులు, సిబ్బంది ఆకుకూరలు, కూరగాయలు, పాదులు పెంచుతున్నారు. వాటికి విద్యార్థులు నీటితో పాటు సేంద్రీయ ఎరువులు అందిస్తున్నారు. కూరగాయలు ఎలా పండించాలో స్వయంగా తెలుసుకుంటున్నారు.

● కూరగాయల్లో పోషకాలు..

విటమిన్ ఎ, కె, సి, బీ6, ఐరన్ వంటి పోషకాలు కూరగాయలు, ఆకు కూరల్లో ఉంటాయి. చిక్కుడులో విటమిన్ డి, ఐరన్, ఫైబర్, నీటి శాతం ఎక్కువగా ఉంటాయి. మునగకాడ, మునగకూరలో మెగ్నీషియం, జింక్, విటమిన్ బీ6, ఐరన్ ఉంటాయని సైన్స్ టీచర్ రోహిణి తెలిపారు. అందువల్లనే ఈ మొక్కలు పెంచుతున్నామన్నారు. వీటితో పాటు వంగ, అరటి, ఆనప, టమాటాతో పాటు సపోటా, జామ, మామిడి పండిస్తున్నారు. ఈ పంటలను సిబ్బంది విద్యార్థులకు అందించేవిధంగా చర్యలు తీసుకున్నారు. తమ కృషికి ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు కూడా పొందామని ఉపాధ్యాయులు చెబుతున్నారు.


కేజీబీవీ పాఠశాల


మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

● విదార్థినులకే అందిస్తున్నాం..

మా పాఠశాలలో గోంగూర, చిక్కుడు, ఆనపకాయలు వంటివి విద్యార్థులతో స్వయంగా సాగుచేస్తున్నాం. ఉదయం లేవగానే నీరు పోయటంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలను విద్యార్థినులే చూసుకుంటున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలలో పండిన కూరగాయలతో తయారు చేసిన కూరను అదనంగా రక్తహీనత గల పిల్లలకు అందిస్తున్నాం.

-రోహిణి, ప్రత్యేకాధికారి

విధి నిర్వహణలో
ఆటుపోట్లు తప్పవు

- ఎన్నికలప్పుడు నా ఏడాదిన్నర కొడుకుకు పది రోజులు దూరం
- అన్ని అవరోధాలను అధిగమిస్తేనే లక్ష్యాలు సాధించగలం
- ఏపీఎస్పీ 5వ బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



విజయనగరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధనలో, విధి నిర్వహణలో అనేక ఆటుపోట్లు ఎదురవుతావని, వాటిని అధిగమించి విజయం వైపు సాగిపోవాలని ఏపీఎస్పీ 5వ బెటాలియన్ కమాండెంట్ మలికా గార్గ్ అన్నారు. దీనికి కుటుంబ ప్రోత్సాహం కూడా ఉండాలన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను మగపిల్లలతో పాటు సమానంగా ప్రోత్సహిస్తే వారు అన్ని రంగాల్లో రాణించగలరన్నారు. ఆడపిల్లలు తమ బలాన్ని నమ్ముకుని.. ఆత్మస్థైర్యంతో అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. బుధవారం విజయనగరం వచ్చిన ఆమె వివిధ అంశాలపై 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: జిల్లాలో మావోయిస్టుల ప్రభావం ఉందా?

మల్లికా గార్గ్: జిల్లాలో మావోయిస్టుల ప్రభావం చాలా తక్కువ. అయినా నిరంతర నిఘా ఉంచుతున్నాం. ముఖ్యంగా, ఏజెన్సీ ప్రాంతాలైన అరుకు, పాడేరు, కొయ్యూరు, సీలేరు, చింతపల్లి తదితర ప్రాంతాల్లో అక్కడి ఎస్‌హెచ్‌వోల అవసరం మేరకు బలగాలను పంపిస్తాం. మైదాన ప్రాంతాల్లోని విశాఖలో అవసరం మేరకు బలగాలు వెలుతుంటాయి.

ప్రశ్న: సిబ్బంది సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

మల్లికా గార్గ్: బెటాలియన్‌లోని పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరాలు నిర్వహించాం. ఇకపై నిపుణులైన వైద్యులను రప్పించి, చికిత్సలు అందించేందుకు కృషి చేస్తాం. విధి నిర్వహణలో మరణించిన సిబ్బందికి ప్రభుత్వం నుంచి సదుపాయాలను త్వరితగతిన అందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రతి 15 రోజులకోసారి దీనిపై సమీక్ష చేస్తున్నాము.

ప్రశ్న: సిబ్బంది నివాస సముదాయాల శిథిలావస్థకు చేరాయి కదా?

మల్లికా గార్గ్: బెటాలియన్‌లోని నివాస సముదాయాలు శిథిలావస్థకు చేరుకున్న మాట నిజమే. వాటికి మరమ్మతులు చేపడుతాం. అనేకమంది సిబ్బంది బెటాలియన్‌కు దగ్గరలోనే అద్దె ఇళ్లల్లో ఉంటున్నారు. వారికి అద్దె సౌకర్యం కల్పిస్తున్నాం.

ప్రశ్న: ఆడపిల్లల ఉన్నతికి మీరిచ్చే సలహాలేమిటి?

మల్లికా గార్గ్: బాల్యం నుంచే ఆడపిల్లలు ధైర్యంగా ముందుకు సాగాలి. తల్లిదండ్రులు వారిని మగపిల్లలతో సమానంగా పెంచాలి. వారి శక్తిని గుర్తించి ప్రోత్సహించాలి. ఆడపిల్లలు తమ బలహీనతను అధిగమించి.. లక్ష్య సాధనలో ముందుకు సాగాలి. సమాజంలో అందరూ సమానమే. ఆడపిల్లలను తక్కువగా చూడరాదు. నా విధి నిర్వహణలో అనేక సమస్యలు ఎదురైనా.. కుటుంబం ప్రోత్సాహంతో ఈ స్థాయిలో ఉండగలిగాను. గత ఎన్నికలప్పుడు సమీపంలో ఉన్నా... నా ఏడాదిన్నర కుమారుడిని 10 రోజులపాటు చూడలేని పరిస్థితి ఎదురైంది. లక్ష్య సాధనలో, విధి నిర్వహణలో అనేక ఆటుపోట్లు ఎదురు కావడం సహజమే. అయితే వాటిని అధిగమించి విజయం వైపు సాగిపోవాలి.


లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి

ఒకటే గమ్యం..

- చురుగ్గా కానిస్టేబుల్ నియామక ప్రక్రియ
- నేటి నుంచి మహిళలకు..

విజయనగరం క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కానిస్టేబుల్ నియామక ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. అభ్యర్థులు ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే దృక్పథంతో పోటీ పడుతున్నారు. మూడో రోజు గురువారం 600 మంది అభ్యర్థులకుగాను 331 మంది మాత్రమే హాజరయ్యారు. వీరికి వేకువజామున 5 గంటల నుంచే పీఎంటీ, పీఈటీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ సౌమ్యలత స్వయంగా పర్యవేక్షించారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం వీరిని పరీక్షలకు అనుమతించారు. శుక్రవారం నుంచి మహిళా కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల ప్రక్రియ చేపడుతున్నారు. ఈ నెల6 వరకు ఈ ప్రక్రియ సాగనుంది. దీని కోసం ప్రత్యేకంగా మహిళా పోలీసు సిబ్బందిని నియమించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

ఘనంగా ధనుర్మాస పూజలు

బొబ్బిలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా గురువారం వేకువజామున పట్టణంలో గల అన్ని వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఆలయం, కల్యాణ, వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో బేడా సేవ, పాశురాల పఠనం, గోవిందనామాలు, విష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.


బొబ్బిలి వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బేడా సేవ

బుచ్చి అప్పారావు పేరు పునరుద్ధరణ

శృంగవరపుకోట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తాటిపూడి జలాశయానికి స్వాతంత్ర్య సమరయోధుడు, జామి మండలానికి చెందిన గొర్రిపాటి బుచ్చి అప్పారావు (జి.బి.అప్పారావు) పేరును కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. ఈ మేరకు గురువారం జల వనరుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంతో పాటు అనేక సంస్థల పేర్లను మార్చేసింది. రాజకీయ ప్రయోజనాన్ని ఆశించి ఆ చర్యలకు పాల్పడింది. పాత పేర్లను పునరుద్ధరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా తాటిపూడి రిజర్వాయర్‌కు పెట్టిన బుచ్చి అప్పారావు పేరు పునరుద్ధరణకు నోచుకుంది. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఈ విషయాన్ని శాసనసభలోనూ ప్రస్తావించారు. ఈ ప్రాంత ప్రజాభిప్రాయాన్ని గౌరవించిన ప్రభుత్వం తిరిగి జలాశయానికి బుచ్చి అప్పారావు పేరు పెట్టింది.

నేడు బోటు షికారు..

గంట్యాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తాటిపూడి రిజర్వాయర్‌లో బోటు షికారును శుక్రవారం పునః ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే విజయవాడ నుంచి బోట్లు, జట్టీలు తెప్పించి అంతా సిద్ధం చేశారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దీనిని ప్రారంభించనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.



సిద్ధం చేసిన బోట్లు, జట్టీలు

నష్ట పరిహారం పెంచాలి

దత్తిరాజేరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మానాపురం రైల్వే థర్డ్ లైన్‌కు సంబంధించి ఇళ్లు, భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం పెంచాలని మానాపురం రైతులు కోరారు. ఈమేరకు గురువారం తహసీల్దార్ పి.విజయభాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తగిన నష్టపరిహారం ఇవ్వలేదని, ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం ఇల్లు కట్టుకోవడానికి, స్థలం కొనుగోలుకు సరిపోదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొటివాడ దాసు, అప్పలనాయుడు, రామసత్యం, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఐపై చర్యలు తీసుకోండి

కొత్తవలస, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకు రావాలని కొత్తవలస న్యాయవాద సంఘం అధ్యక్షురాలు డీవీఎల్ దేవి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. అనంతపురానికి చెందిన సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతికి కారణమైన సీఐ, సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాది మృతిపై గురువారం న్యాయవాది సంఘం హాల్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు ప్రసాద్, నందిపల్లి శ్రీరామ్మూర్తి, డి.శివప్రసాద్, డి.శ్రీనివాస్, నాగేంద్ర సాయి, గవర కృష్ణ, లత, కృష్ణమూర్తి తదితరులున్నారు.

ఆక్రమణలను తొలగించండి

రాజాం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కంచరాంలోని కాశీవిశ్వేశ్వర శివాలయం ఆవరణలో ఇద్దం చెరువు ఆక్రమణలను తొలగించాలని కోరుతూ సమతా సైనిక్ దళ్ జిల్లా కార్యదర్శి రెయ్యి రామకృష్ణ.. తహశీల్దార్ ఎస్.కృష్ణంరాజుకు వినతిపత్రం అందజేశారు. గురువారం కంచరాంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ దృష్టికి చెరువు ఆక్రమణలను తీసుకెళ్లారు. ఆక్రమణలు తొలగించి చెరువును పరిరక్షించాలని కోరారు.

ప్రకృతి సాగుతో తెగుళ్ల నివారణ

బొండపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సాగు విధానంలో మామిడి, జీడితోటలకు ఆశించిన తెగుళ్ల నివారణ సాధ్యమని ప్రకృతి సాగు ఎంటీ సన్యాసినాయుడు తెలిపారు. మండలంలోని రయింద్రాంలో గురువారం ప్రకృతి సాటులో చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కషాయాలు తయారు చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి సాగు సిబ్బంది కర్రి రామునాయుడు, బి.ఉమ, ఆర్.అప్పలనాయుడు, బి.పైడిరాజు, కొండమ్మ, కె.కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

సంతకవిటి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈనెల 5 నుంచి 8 వరకు నిర్వహించనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు హాజరై జయప్రదం చేయాలని ఫెడరేషన్ మండల అధ్యక్షుడు బూరాడ శ్రీనివాస్, కార్యదర్శి డోల కృష్ణారావు, కౌన్సిల్ శాసపు బాబురావు పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం సిరిపురంలో స్వర్ణోత్సవ మహాసభల గోడ పత్రికను హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటరావు చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు.

మత్తును తరిమేద్దాం

సంతకవిటి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై సంకల్పం పేరిట మండవకురుటిలో గురువారం రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు అవగాహన కల్పించారు. మద్యం మత్తు కలిగించే మాదక ద్రవ్యాల వినియోగం ఒకరి సమస్య కాదని, ప్రతీ ఒక్కరిదన్నారు. వాటిని నియంత్రించే బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపాలరావు, యువకులు, ఆటోడ్రైవర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జిల్లా తలసరి ఆదాయం పెంపునకు కృషి

విజయనగరం కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్‌లో భాగంగా ప్రాథమిక రంగంలో జిల్లాలో తలసరి ఆదాయాన్ని 15 శాతం పెంచడానికి లక్ష్యంగా నిర్ణయించామని, ప్రస్తుతం రూ.35 వేలు ఉన్న తలసరి ఆదాయాన్ని రూ.65 వేలకు పెంచాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు కలెక్టరు అంబేద్కర్ తెలిపారు. అందుకు కోసం ఒక కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ప్రాథమిక రంగంపై గురువారం సాయంత్రం ఆయా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఆదర్శ గ్రామానికి రూ.కోటి

విజయనగరం కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎం సూర్యఘర్ పథకం ద్వారా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో రాయితీపై సౌర విద్యుత్ యూనిట్లు ఏర్పాటును పెద్ద ఎత్తున ప్రోత్సహించనున్నట్లు కలెక్టరు అంబేద్కర్ గురువారం తెలిపారు. వచ్చే ఫిబ్రవరిలోగా జిల్లాలో 51 వేల ఎస్సీ, ఎస్టీ గృహాల్లో సౌర విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసే దిశగా డీఆర్‌డీఏ, మెప్మా, మున్సిపల్ విద్యుత్ పంపిణీ సంస్థలు సమన్వయంతో పని చేయాలన్నారు. శతశాతం గృహాలతో అత్యధిక సౌర విద్యుత్ కనెక్షన్లు కలిగిన గ్రామాలకు రూ. కోటి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జేసీ సేతు మాధవన్ ఉన్నారు.

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించండి

● అధికారులకు జేసీ సేతుమాధవన్ ఆదేశం



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

శృంగవరపుకోట రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్టు గుర్తిస్తే ఆక్రమణదారులకు ఎటువంటి నోటీసులు ఇవ్వాల్సిన పనిలేదు.. వాటిని తొలగించాలనీ రెవెన్యూ అధికారులను జేసీ జేసీ సేతు మాధవన్ ఆదేశించారు. గురువారం మండలంలోని ముషిడిపల్లిలో తహశీల్దార్ అరుణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ముషిడిపల్లిలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు జోరుగా సాగుతోందని స్థానికులు జేసీకి ఫిర్యాదు చేశారు. చెరువులు కబ్జా చేసి లే-అవుట్ వేసేశారన్నారు. గ్రామంలో పెద్దబంద, చినబందలను కొందరు పెద్దలు ఆక్రమించి ఫలసాయం పొందుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన జేసీ.. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జేసీతో యువకులు మాట్లాడుతూ గ్రామానికి ఆనుకుని ఉన్న ఇరిగేషన్ భూములు ఆక్రమణలకు గురయ్యాయని, ఇదే విషయం గతంలో ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. సమస్యను పరిష్కరిం చాలని తమరు ఆదేశించినా రెవెన్యూ అధికారులు స్పందించలేదని ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ ఇరిగేషన్ భూముల్లో కొందరు పెద్దలు పక్కా నిర్మాణాలు చేపట్టినా డీఈ పట్టించుకోవడం లేదన్నారు. ఇరిగేషన్ అధికారులు ఆ భూములను అమ్మేశారా అనే అనుమానం కలుగుతోందన్నారు. పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ తాటిపూడి రిజర్వాయర్ భూముల్లో పక్కా నిర్మాణాలు వెలిశాయని, ఓ వ్యక్తి పెద్ద భవనాన్ని నిర్మించి అనధికారికంగా విద్యుత్ సైతం వాడుతున్నారని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వంలో పెద్దల పేర్లు చెప్పి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. విజయనగరానికి చెందిన ఒక బడా వ్యక్తి ఇక్కడ లే-అవుట్ వేశాడని, ప్రభుత్వ భూముల్లో రోడ్డు వేయడంతో ఆ విషయం కోర్టు పరిధిలో ఉందన్నారు. ఆక్రమణలపై జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ భూములపై ఎటువంటి న్యాయవివాదాలు చెల్లవన్నారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు ఉంటే వెంటనే స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ భరత్‌కుమార్, ఆర్ఐ మనోజ్ తదితరులున్నారు.



నగరం అభివృద్ధే ధ్యేయం

స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్ విజయలక్ష్మి

విజయనగరం రింగురోడ్డు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విజయనగరం అభివృద్ధే ధ్యేయంగా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. గురువారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. అజెండాలో పొందుపరిచిన 20 అంశాలపై చర్చ అనంతరం సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రారంభంలోనే ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఈ అత్యావసర సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అందరి సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. రహదారుల పాక్షిక మరమ్మతులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో కమిషనర్ పి.నల్లనయ్య, సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేశ్, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణక్య, సుంకరి నారాయణ రావు, రేగాన రూపాదేవి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గంజాయిపై ప్రత్యేక నిఘా: డీఎస్పీ



వేపాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి రవాణాను అరికట్టేం దుకు ఎస్పీ వకుళ్ జిందాల్ ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటుతో పాటు సైబర్ నేరాలు అదుపునకు చర్యలు తీసుకుంటున్నామని విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు అన్నారు. గురువారం వల్లంపూడి పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వారి నుంచి పలు సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా వీలుపర్తి రహదారిలో స్పీడు బ్రేకర్లు ఏర్పా టు చేయించాలని ఎస్ఐ దేవికి సూచించార అనంతరం గ్రామ సచివాలయ మ హిళా పోలీసులతో సమావేశమైన డీఎస్పీ గ్రామాల్లో ప్రజలను సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్.కోట సీఐ ఎల్.అప్పలనాయుడు, ఎస్ఐ బి.దేవి పాల్గొన్నారు.

రోడ్డు ఏర్పాటు చేయండి

● ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించిన మారిక గిరిజనులు

● వంటా వార్పుతో నిరసన



రెవెన్యూ కార్యాలయం ఎదుట వంటావార్పు చేస్తున్న గిరిజనులు

వేపాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మారిక రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ అదే గ్రామానికి చెందిన గిరిజనులు మండల పరిషత్ కార్యాయాలన్ని గురువారం ముట్టడించారు. కార్యాలయ ఆవరణలో వంటావార్పుతో నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ సారధ్యంలో చేపట్టిన కార్యక్రమంలో మారిక రోడ్డు నిర్మాణం చేపట్టాలని, విద్య, వైద్యం అందించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై తహశీల్దార్ జె.రాములమ్మ, ఎంపీడీవో సిహెచ్.సూర్యనారాయణ స్పందించారు. పంచాయతీరాజ్ కొత్తవలస విభాగం ఇంజనీర్ ఐశ్వర్యను పిలిపించి గిరిజనులతో మాట్లాడించారు. ఈ సందర్భంగా ఐశ్వర్య మాట్లాడుతూ గిరిజనుల ఆందోళన విషయాన్ని కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనుల ప్రారంభానికి కృషి చేస్తానన్నారు. దీనిపై సంతృప్తి చెందని గిరిజనులు.. రహదారి పనులు చేపట్టే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. ఆందోళనలో కరకవలస సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ, గమ్మెల బాబూరావు, గమ్మెల అప్పలనాయుడు, కృష్ణ, జాలారి వీరాజు, బాల సోమేశ్వరరావు, రామకృష్ణ, అప్పారావు, లింగరాజు తదితరులున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

లక్కవరపుకోట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎల్.కోటలో సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణానికి ఎమ్మెల్యే లలితకుమారి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందుకుగానూ రూ.20 లక్షల మేర వెచ్చిస్తున్నామన్నారు. డి.ఆదిబాబు కళ్లాల నుంచి బీసీ కాలనీ వరకు రోడ్డు, డ్రైను నిర్మిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయన్నారు. రోడ్లు, డ్రైన్లు, పశువుల షెడ్లు, చెక్‌డ్యాంలు ఇలా ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్లా రామకృష్ణ, కల్లద్దాల శ్రీను, జేఈ వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రైతు

లక్కవరపుకోట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలు లేకుండా చూడాలని రెవెన్యూశాఖ అధికారులను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదేశించారు. గురువారం తలారిలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆమె హాజరయ్యారు. కార్యాలయాల చుట్టు తిరగకుండా ప్రజల వద్దకే అధికారులను పంపించి భూసమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశంతో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం భూసర్వే పేరుతో ప్రభుత్వ, పేదల భూములను లాక్కుందని విమర్శించారు. రైతులు సామరస్యపూర్వకంగా భూతగాదాలు పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావుతో పాటు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, తహసీల్దార్ ప్రసాదరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దేశ సమగ్రత, మత సామరస్యంపై ప్రచారం

విజయనగరం దాసన్నపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దేశ సమగ్రత, మత సామరస్యంపై సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి వారం రోజుల పాటు ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తెలిపారు. గురువారం ఎల్‌బీజీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మత సామరస్యానికి లౌకికతత్వానికి పెను ప్రమాదం ఏర్పడిందన్నారు. మతాన్ని ఆచరించడంలో తప్పులేదని, అయితే మతాన్ని జోడించి రాజకీయాలు చేయడం తగదన్నారు. సమావేశంలో సీపీఎం ప్రతినిధులు లక్ష్మి, రెడ్డి శంకరరావు, టీవీ రమణ పాల్గొన్నారు.

తవ్వకాలపై మరోసారి ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రేగిడి, జనవరి 2, (ఆంధ్రజ్యోతి): బొడ్డవలస-గోపాలపురం నదీమధ్యలో ఇసుక తవ్వకాలపై విజయనగరం జిల్లా అధికారులు మరోసారి ఆరా తీసినట్టు సమాచారం. డిసెంబరు 23న 'పర్యవేక్షణ లేక.. ఇసుక దందా ఆగక..' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనానికి జేసీ ఆదేశాల మేరకు స్థానిక తహశీల్దార్ నివేదిక ఇచ్చారు. తాజాగా 'తోడేస్తున్నారు' శీర్షికతో మరో కథనం రావటంతో మరోసారి కలెక్టర్ కార్యాలయం ఇక్కడ పరిస్థితులపై ఆరా తీసినట్టు సమాచారం. వీఆర్వో దుర్గారావు గురువారం నదీ ప్రాంతాన్ని సందర్శించారు. ఆ సమయంలో బొడ్డవలస అవతలి ఒడ్డున రెండు ఎక్స్‌కవేటర్ ఇసుక తవ్వకాలు చేస్తున్నట్టు గుర్తించి తహశీల్దార్‌కు సమాచారం ఇచ్చారు.

నాగావళిలో తవ్వకాలు ఆపండి

● కాంగ్రెస్ పార్టీ రాజాం ఇన్‌చార్జి 'కుప్పిలి'

రేగిడి, జనవరి 2, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల సరిహద్దు ప్రాంతం రేగిడి మండలం బొడ్డవలస, పాలకొండ మండలం గోపాలపురం నాగావళి మధ్యలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేస్తుండటంపె రాజాం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కుప్పిల చైతన్యకుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. 'తోడేస్తున్నారు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి ఫోన్‌లో మాట్లాడారు. ఇసుక తవ్వకాల వల్ల ఒకవైపు ఏడు మండలాలకు వెళ్లే తాగునీటి ఊట బావులకు ముప్పు, ఇసుక క్వారీల వల్ల నదీ ప్రవాహ దిశ మారుతోందన్నారు. భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలపై ఉమ్మడి జిల్లాల నిఘా యంత్రాంగం స్పందించి, దీన్ని నియంత్రించే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యను కాంగ్రెస్ పార్టీ చీఫ్ షర్మిళమ్మ దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

బ్యాంకు దోపిడీకి యత్నం

● పోలీసులు, క్లూస్‌టీం పరిశీలన



బ్యాంకులో పరిశీలిస్తున్న క్లూస్‌టీం, పోలీసులు

పూసపాటిరేగ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాడ జంక్షన్ వద్ద గల బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులో గురువారం వేకువజామున దోపిడీ యత్నం జరిగింది. బ్యాంకు సీసీ కెమెరాల్లో రికార్డు అయిన వివరాల ప్రకారం.. సుమారు 2 గంటల ప్రాంతంలో ఒక వ్యక్తి బ్యాంకు కిటికీ గ్రిల్స్‌ను తీసి లోపలికి ప్రవేశించాడు. ముఖానికి ముసుగు, చేతులకు గ్లోవ్స్ వేసుకున్న ఆ వ్యక్తి బ్యాంకులోని లాకర్ గది తలుపు తెలిచేందుకు యత్నించాడు. లాకర్ డోర్ తెరుచుకోకపోవటంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. క్యాషియర్ గదిలోకి ప్రవేశించేలోగా అలారం మోగటంతో వెనుదిరిగాడు. దోపిడీకి యత్నిస్తున్న సమయంలో సీసీ కెమెరాలకు సంబంధించిన యూపీఎస్‌ను ఆపినట్లు నమోదు అయ్యింది. ఆ తర్వాత బ్యాంక్ బయట ఉన్న ఏటీఎంలో చోరీకి ప్రయత్నించినా అందులో సొమ్ములేక పోవటంతో బ్యాంకులో ఎలాంటి నష్టం జరగలేదు. అయితే బ్యాంకు దోపిడీకి యత్నించిన వ్యక్తి పక్కా ప్లాన్‌తోనే వచ్చాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉదయాన్నే బ్యాంకుకు వచ్చిన ఉద్యోగులు.. అక్కడ అన్నీ చెల్లాచెదురుగా పడి ఉండటంతో బ్యాంకు మేనేజర్‌తో పాటు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దాంతో దోపిడీకి యత్నం విషయం బయటపడింది. ఘటనా స్థలానికి పోలీసులు, క్లూస్ టీం చేరుకుని బ్యాంకులో ఆధారాల కోసం పరిశీలించారు. అధికారుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసును నమోదు చేశారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న బ్యాంకులోనే దోపిడీకి యత్నించటం స్థానికంగా చర్చనీయాంశమైంది.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

చీపురుపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వంగపల్లిపేట సమీపంలో పేకాటాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ ఎల్.దామోదరరావు తెలిపారు. పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేశామన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.32,990 నగదు, 3 సెల్‌ఫోన్లు, మోటారు బైక్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

సీతానగరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంట పొలాల్లో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులపై గురువారం పిచ్చి కుక్క దాడి చేసి గాయపరిచింది. క్షతగాత్రులు పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పిచ్చి కుక్క ఎక్కడ నుంచి వచ్చిందో తెలియదు గానీ తామరఖండి, బళ్లకృష్ణాపురం, బక్కుపేట గ్రామల మధ్య ఉన్న పొలాల్లో ఎవరి పొలాల్లో వారు వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన సమయంలో వెనుక నుంచి వచ్చి గాయపర్చింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు తామరఖండి గ్రామానికి చెందిన వై.శ్రీనివాసరావు, బళ్లకృష్ణాపురం గ్రామానికి చెందిన జి.శ్రీనివాసరావు, బక్కుపేట గ్రామానికి చెందిన తేలు మోక్షితలు పిచ్చి కుక్క దాడిలో గాయాలపాలయ్యారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు పావని క్షతగాత్రులకు వైద్య సేవలందించి, మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాసుపత్రికి రిఫర్ చేశారు.

రిజిస్ట్రేషన్ అప్రూవల్ సమయం పెంపు

కొత్తవలస, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న గంటలోనే ఇంతవరకూ రిజిస్ట్రేషన్ అప్రూవల్ చేయాల్సి ఉండేది. ఇకపై ఆ సమయాన్ని రాష్ట్ర ప్రభుత్వం 48 గంటలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎనీ వేర్ రిజిస్ట్రేషన్ పేరుతో రాష్ట్రంలోని ఎక్కడ ఆస్తినైనా ఎక్కడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనైనా రిజిస్ట్రేషన్ చేయించుకునే వీలు కల్పించింది. గతంలో ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న దస్తావేజును పెండింగ్‌లో ఉంచి ఆస్తి ఏ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఉందో ఆ కార్యాలయానికి ఆన్‌లైన్‌లో పంపించేవారు. అక్కడ నుంచి అప్రూవల్ వచ్చిన తరువాత రెగ్యులర్ దస్తావేజు నంబర్ ఇచ్చేవారు. ఈ విధానం వల్ల జాప్యం జరుగుతోందని రిజిస్ట్రేషన్ అయిన గంటలోనే సంబంధిత కార్యాలయానికి పంపి అప్రూవల్ ఇవ్వాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో ఎనీ వేర్ రిజిస్ట్రేషన్ మరింత సులభతరం అయింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిబంధనకు సడలింపు చేసింది. రిజిస్ట్రేషన్ అయిన 48 గంటల తర్వాత అప్రూవల్ వచ్చే విధంగా మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిబంధన సరైనది కాదని దస్తావేజు లేఖరులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు తగ్గిపోతాయన్నారు.

హుండీ ఆదాయం రూ.18.32 లక్షలు



హుండీలను లెక్కిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.18, 32,397 లభించిందని ఈవో వై.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం చేపట్టిన హుండీ లెక్కింపులో విజయనగరం పైడిమాంబ సేవా సంఘం ప్రతినిధులు, రామతీర్థం దేవస్థానం సిబ్బంది, ఏపీజీవీ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. లెక్కింపు పర్యవేక్షణ అధికారులుగా విజయనగరం ఏసీ కార్యాలయం నుంచి జి.శ్యామ్‌ప్రసాద్, గ్రూపు దేవాలయాల ఈవో కె.పద్మావతి తదితరులు వ్యవహరించారు.

హాస్టల్స్‌లో సదుపాయాలు కల్పించండి

విజయనగరం దాసన్నపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, సహాయ కార్యదర్శులు సునీల్, పి.గౌరీశంకర్ కోరారు. గురువారం కలెక్టరు కార్యాలయంలోని ప్రభుత్వ వసతి గృహాల సంక్షేమాధికారులను కలిసి వినతిపత్రం అందించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాల్లో కనీసం సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొన్నేళ్లుగా విద్యార్థులు విషజ్వరాలు, ఆహార కల్తీ, పాము కాటు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ మృత్యువాత పడుతున్నారన్నారు. కొన్నిచోట్ల వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో విద్యార్థులు చాలీచాలని వసతి పొందుతున్నారని వారు వివరించారు.

ఏడాదిగా ఉపాధికి దూరం

● 350 మంది వేతనదారులకు అన్యాయం

● పట్టించుకోని యంత్రాంగం

● డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయం



చింతాడవలసకు చెందిన ఉపాధి వేతనదారులు

మెంటాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సుమారు ఏడాదిగా అక్కడ ఉపాధి హామీ వేతనదారులకు అధికారులు పనులు కల్పించడంలేదు. దాంతో 400 వేతనదారులు జీవనోపాధికి దూరంగా ఉన్నారు. ఇక్కడ ఉపాధి హామీ పనులు చేపట్టేందుకు అవకాశం ఉన్నా.. ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం విషయంలో రెండు వర్గాలు పంతాలకు పోవడంతో ఈ పరిస్థితికి కారణం. ఈ విషయా న్ని చక్కదిద్దాల్సిన యంత్రాంగం మనకెందుకులే అన్నట్టు వ్యవహరిస్తుండటంతో వందలాది వేతనదారులకు అన్యాయం జరుగుతోంది.

మండలంలోని ఇప్పలవలస, చింతాడవలస గ్రామాలు ఒకే పంచాయతీగా ఉన్న సమయంలో అక్కడ ఉపాధి పనులు జరుగుతుండేవి. మూడేళ్ల క్రితం రెండు గ్రామాలను వేర్వేరు పంచాయతీలుగా విభజించారు. ఆ సమయంలో చింతాడవలస ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఏలుమార్లు విచారణ అనంతరం ఆయన్ని కొన్నాళ్ల కిందట విధుల నుంచి తప్పించారు. ఆ స్థానంలో ఇప్పటికీ కొత్తవారిని నియమించలేదు. దాంతో ఇక్కడ ఉపాధి పనులు మంజూరు చేయడం లేదు. 217 జాబ్ కార్డులు, 411 మంది ఉపాధి వేతనదారులు చింతాడవలసలో ఉన్నారు. ఏడాదిగా ఉపాధి పనులు కల్పించాలని ఎన్ని వినతులు ఇచ్చినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం చుట్టూ రాజకీయం అల్లుకుంది. తమకు అనుకూలమైన వ్యక్తిని నియమించుకోవాలని వైసీపీ, జనసేన నాయకులు పావులు కదుపుతున్నారు. ఈ రెండు పార్టీల పంతాలకు వేతనదారులు బలవుతున్నారు. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం అమలును ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో ఇటువంటి పరిస్థితి తలెత్తడం చర్చనీయాంశంగా మారింది. ఇన్నాళ్లూ ఓపికగా ఉన్న వేతనదారులు ఇకపై తాడోపేడో తేల్చుకోవాలని భావిస్తున్నారు. మరోసారి స్థానిక అధికారులు, కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తామని, వారు స్పందించకుంటే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదు చేయాలనే నిర్ణయానికి వచ్చారు.

యువతకు 'సెంచూరియన్' ఉపాధి

● సీడాప్‌తో ఒప్పందం ● సంస్థ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డి.ఎన్.రావు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ డి.ఎస్.రావు

నెల్లిమర్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో త్వరలో ఎగుమతి ఆధారిత యూనిట్ నెలకొల్పనున్నట్లు ఆ సంస్థ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డి.ఎన్.రావు వెల్లడించారు. గురువారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే ఒక విశ్వవిద్యాలయంలో ఎగుమతి ఆధారిత యూనిట్ నెలకొల్పడం ఇదే ప్రథమమన్నారు. ఇక్కడ నుంచి ఆస్ట్రేలియా, ఇతర దేశాలకు ఎగుమతులు చేపడతామన్నారు. 2047 నాటికి రాష్ట్రంలో ప్రతి కుటుంబం నుంచి ఒకరు వ్యవస్థాపకుడిగా ఎదగాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమన్నారు. అందులో భాగంగా ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ సమక్షంలో సీడాప్ (సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రంలో ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్, స్వయం ఉపాధి, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల ఆదాయాన్ని కల్పించడం ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామన్నారు. రానున్న కాలంలో ఉత్తరాంధ్ర ప్రాంతానికి సంబంధించి యువతకు సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ప్రస్తుతం సెంచూరియన్‌లో డ్రోన్‌ల తయారీ, డ్రోన్‌ల పరిశోధన, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ యూనిట్లు నెలకొల్పామన్నారు. దాంతో పాటు స్మార్ట్ అగ్రికల్చర్‌లో భాగంగా డ్రాగన్ పండ్ల మొక్కల పెంపకం, వెనిలా సాగు చేపట్టనున్నామన్నారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్‌తో కూడా ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. సమావేశంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు ప్రొఫెసర్ ముక్తికాంత్ మిశ్రా, ఛాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్‌రాజు, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి, డాక్టర్ పల్లవి, పద్మ పాల్గొన్నారు.

వారు కొనరు.. వీరు అమ్ముకోనివ్వరు

(ఐదో పేజీ తరువాయి)

వారపు సంతలకు వేల సంఖ్యలో కొండచీ పుర్లను గిరిజన రైతులు తీసుకువస్తున్నా కొనుగోలు చేసేందుకు మైదాన వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. చేసేది లేక కొందరు వాటిని ఇంటికి తీసుకుపోతుండగా, మరికొందరు ఒక్కో కొండచీపురును రూ.20కే కారుచౌకగా అమ్ముకుంటున్నారు.

అటవీశాఖ ఎందుకిలా చేస్తోంది?

గిరిజనుల నుంచి కొనుగోలు చేసిన అటవీ ఉత్పత్తులను జీసీసీ పర్మిట్‌తో మైదాన ప్రాంతాలకు వాహనాల్లో తరలిస్తే ఎవరూ అడ్డుచెప్పరు. కానీ, సీతంపేట ఏజెన్సీలో జీసీసీ సేవలు కొన్నేళ్లుగా స్తంభించాయి. దీంతో మైదాన ప్రాంత వ్యాపారులు జీసీసీ చేయలేని మార్కెటింగ్‌ను వారు చేసుకుంటూ లాభ పడుతున్నారు. దీనిని అరికట్టాలనే ఉద్దేశంతో ఇటీవల కాలంలో అటవీశాఖ అధికారులు వారపు సంతల్లో వ్యాపారుల చేస్తున్న దందాపై నిఘా పెట్టారు. దీనిలో భాగంగా కొండ చీపుర్లను మైదాన ప్రాంతాలకు తరలిస్తున్న వాహనాలపై దాడులు చేసి అపరాధ రుసుం వసూలు చేశారు. అయితే, తమ ఉత్పత్తులను ఒకపక్క జీసీసీ కొనుగోలు చేయకపోతే, మరోపక్క వ్యాపారులకూ అమ్ముకోనీయకపోతే ఎలా బతకాలని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యను ఇటీవల ఐటీడీఏలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ శోభిక, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ దృష్టికి గిరిజన నాయకులు తీసుకువెళ్లారు. అయినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

మేము తీసుకువచ్చిన కొండచీపుర్లను వ్యాపారులు కొనుగోలు చేయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుపడుతుంది. ఇటు జీసీసీ కొనుగోలు చేయక, అటు వ్యాపారులు కొనక ఇబ్బందులు పడుతున్నాం. ధరను తగ్గించి అమ్మినా కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఐటీడీఏ ఆదుకోవాలి.

- సవర శ్రీకాంత్, పాండ్ర, సీతంపేట

జీసీసీ మాత్రమే కొనుగోలు చేయాలి

గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులను జీసీసీ మాత్రమే కొనుగోలు, రవాణా చేయాలి. దళారులు, మైదాన ప్రాంత వ్యాపారులు కొనుగోలు చేసి అక్రమంగా రవాణా చేసే కేసులు నమోదు చేసి అపరాధ రుసుం వసూలు చేస్తాం. ప్రతి ఐదేళ్లకు ఒకసారి జీసీసీ, అటవీశాఖల మధ్య అగ్రిమెంట్ జరుగుతుంది. అగ్రిమెంట్ ఆధారంగా ప్రతి నెల జీసీసీ కొనుగోలు చేసే అటవీ ఉత్పత్తుల వివరాలను అటవీ శాఖకు ఇవ్వాల్సి ఉంది. 2022-27 వరకు జీసీసీతో అగ్రిమెంట్ ఉంది. మొత్తంగా 24రకాల గిరిజన ఉత్పత్తులు కొనుగోలు, మార్కెటింగ్, రవాణా వంటి వివరాలు అగ్రిమెంట్‌లో నమోదు చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడే పరిస్థితి లేకుండా మేము ఈ చర్యలు తీసుకుంటున్నాం.

- వై.సంజయ్, సబ్ డీఎఫ్‌వో, పాలకొండ అటవీశాఖ రేంజ్

జాయింట్ ఎల్‌పీఎం సమస్యకు చెక్

(ఐదో పేజీ తరువాయి)

ఆర్డీ నెంబరు 1ను విడుదల చేశారు. దీని ప్రకారం రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంలపై స్వీకరించిన దరఖాస్తులను పూర్తి పరిశీలన చేసి, ఆన్‌లైన్ సబ్ డివిజన్ ఉచితంగా చేయాలని ఆదేశించారు. దీనికి ఆరు నెలలు గడువు కూడా ఇచ్చారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా సంతోషం..

గత ప్రభుత్వం జాయింట్ ఎల్‌పీఎంలు ఇవ్వడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉచితంగా ఆన్‌లైన్ సబ్ డివిజన్ చేయడానికి జీవో జారీ చేయడం సంతోషంగా ఉంది.

-మరడ సత్యనారాయణ, రైతు, తురకనాయుడువలస, జియ్యమ్మవలస మండలం

అధికారులు పకడ్బందీగా చేయాలి..

రైతులకు మేలు చేసేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జాయింట్ ఎల్‌పీఎంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తేకుండా అధికారులు పకడ్బందీగా ఆన్‌లైన్ సబ్ డివిజన్ చేయాలి.

-సింగిరెడ్డి శివున్నాయుడు, రైతు, తురకనాయుడువలస, జియ్యమ్మవలస మండలం

వారం రోజుల్లో అమలవుతుంది..

జాయింట్ ఎల్‌పీఎంలు ఉచితంగా ఆన్‌లైన్ సబ్ డివిజన్ చేయమని ప్రభుత్వం జీవో ఇవ్వడం వాస్తవమే. వారం రోజుల్లో విధి విధానాలు రానున్నాయి. కచ్చితంగా చేస్తాం.

-పి.లక్ష్మణరావు, జిల్లా సర్వేయింగ్ ఏడీ, పార్వతీపురం మన్యం జిల్లా

మైనార్టీ యువతకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ

పార్వతీపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ యువతకు నైపుణ్య అభివృద్ధిలో ఉచిత శిక్షణ ఇస్తున్నామని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకుడు ఆర్ఎస్ జాన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సొసైటీ ఫర్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ జనరేషన్, ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ సౌజన్యంతో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యక్రమాన్ని రూపొందించారు. జిల్లాలో ఉన్న ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బౌద్ధులు, పార్శీలు, జైనులు తదితర మైనార్టీ వర్గాలకు చెందిన యువతకు ఆసక్తి ఉన్న రంగంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఉద్యోగ ఉపాధి కల్పిస్తామన్నారు. మూడు నెలల శిక్షణ కాలంలో వసతి, యూనిఫారం, భోజనం, స్టడీ మెటీరియల్ ఇస్తామని చెప్పారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలు అందిస్తామన్నారు. అర్హులైన మైనార్టీ అభ్యర్థులు వారి విద్యార్హతలు, వయస్సు, ఆధార్, చిరునామా, ఫోన్ నెంబర్ తదితర వివరాలతో బయోడేటాను విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో ఉన్న మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో అందించాలని వివరించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

వీరఘట్టం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని ప్రచార కమిటీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు ముద్ద వెంకటరమణ అన్నారు. నడిమికెల్ల గ్రామంలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం-2005 సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

రైతు సంక్షేమమే దేశ సౌభాగ్యం

ఒడిశా

రాయగడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే దేశ సౌభాగ్యమని స్థానిక ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక అన్నారు. గురువారం స్థానిక బిజూ కల్యాణ మండపంలో జరిగిన పానీ పంచాయతీ (నీటి సంఘాల) పక్షోత్సవ ముగింపు వేడుకలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. వ్యవసాయ శాఖాధికారులు గ్రామాల్లో పర్యటించి వివిధ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పానీ పంచాయతీ ఉపయోగాలపై విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు, ఉత్తమ రైతులకు బహుమతులు అందజేశారు. గౌరవ అతిథులుగా బిసంకటక్ ఎమ్మెల్యే నీల మాధవ హిక్కాక, అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రౌయిత్ పాల్గొన్నారు.

రాయగడలో బైక్ పెట్రోలింగ్

రాయగడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెరిగిపోతున్న నేరాలను అరికట్టేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం తొలిసారిగా బైకు పెట్రోలింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాలను ఎనిమిది భాగాలుగా విభజించి 8 బైకులపై గస్తీ నిర్వహించేందుకు నిర్ణయించారు. ఒక్కో బైకుపై ఇద్దరు పోలీసులు విధులు నిర్వహిస్తారని రాయగడ ఠాణా అధికారి కహర్ తెలిపారు.

నిలిచిన పనులు.. తప్పని అవస్థలు

- అర్ధాంతరంగా రహదారి నిర్మాణం
- నిత్యం ట్రాఫిక్‌జాం
- తెగిన పైపులైన్లు.. పూడుకుపోతున్న కాలువలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న కురుపాం వాసులు

కురుపాం, జనవరి2(ఆంధ్రజ్యోతి): కురుపాం నుంచి పార్వతీపురం వెళ్లే రహదారి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో గత రెండేళ్ల నుంచి కురుపాం వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం గుత్తేదారులకు ఇవ్వాల్సిన బిల్లులు చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. అలాగే వీధి కాలువల్లో కూడా మురుగు స్తంభించిపోతోంది. సుమారు రెండేళ్ల కిందట తోటపల్లి నుంచి కురుపాం వరకు 14 కిలో మీటర్ల మేర రహదారి విస్తరణ పనులకు రూ.33 కోట్లు మంజూరు చేశారు. అప్పట్లో బీటీ రోడ్డు, మధ్యలో కొన్ని కల్వర్టులు పూర్తి చేశారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్‌కు అప్పటి ప్రభుత్వం బిల్లు చెల్లించలేదు. దీంతో పనులను ఎక్కడివక్కడే నిలుపదల చేసి వెళ్లిపోయారు. పెదమేరంగి జంక్షన్, సీమనాయుడు వలస, కురుపాం ప్రధాన రహదారులు, సిమెంటు రోడ్లు వేయాల్సి ఉండగా ఆగిపోయాయి. అలాగే కురుపాం ప్రధాన రహదారిలో కాలువల పనులు సగంలో నిలిచిపోయాయి. ప్రధాన రహదారి విస్తరణ పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. ఈ అరకొర పనుల కారణంగా రహదారి పూర్తిగా పాడయ్యింది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. అలాగే స్థానిక ధూళికేశ్వరస్వామి ఆలయం వద్ద కల్వర్టు నిర్మాణం జరగకపోవడంతో రహదారిపై కాలువ నీరు ప్రవహిస్తోంది. బస్టాండ్ సమీపంలో కాలువలు నిర్మాణం చేపట్టకపోవడంతో పేరుకుపోతున్న మురుగు కారణంగా దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారు. రహదారి విస్తరణ పనులు పూర్తి కాకపోవడంతో పట్టణంలో నిత్యం ట్రాఫిక్‌జాం అవుతోంది. ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రహదారి విస్తరణ పనులు సగంలో నిలిచిపోవడంతో కొళాయిల పైపులు ఎక్కడికక్కడ పగిలిపోయాయి. నీరు వృథాగా పోతోంది. కొళాయిల ద్వారా కూడా సక్రమంగా నీరు అందడం లేదు. స్థానికులు తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రహదారి నిర్మాణాన్ని పూర్తి చేసి, కురుపాం వాసుల సమస్యలను పరిష్కరించాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.




గుంతల రహదారిలో వాహనచోదకుడి అవస్థలు, కురుపాం ప్రధాన రహదారిపై నిలిచిన ట్రాఫిక్

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. శ్రద్ధగా చదువుకుని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చుక్క శ్రీరంజని, మండల కన్వీనర్ పాడి సుదర్శనరావు, నాయకులు రామారావు, తులాల రవి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహాల మంజూరు

బలిజిపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ పక్కా గృహాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని గృహ నిర్మాణశాఖ డీఈ జి.సోమేశ్వరరావు తెలిపారు. గురువారం బలిజిపేట వచ్చిన సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఏ పథకంలోనూ గృహాలు మంజూరు కాని లబ్ధిదారులకు పక్కా గృహాలు మంజూరు చేస్తారని ఆయన స్పష్టం చేశారు. ఇంతవరకు 2,383 గృహాలు మంజూరయ్యాని, వాటిలో 1,745 పూర్తిగా 410 వివిధ స్థాయిల్లో ఉన్నాయని తెలిపారు. 228 అసలు నిర్మాణం జరగలేదని, వాటిని రద్దు చేస్తామని చెప్పారు. నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తామని తెలిపారు.

చిన్న తప్పులకు సస్పెన్షన్ తగదు

బెలగాం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు చేసే చిన్నచిన్న తప్పులకు వారిని సస్పెండ్ చేయడం, బదిలీ చేయడం అన్యాయమని సీనియర్ న్యాయవాది, లీగల్ అడ్వయిజర్ టి.జోగారావు అన్నారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేకమైన జీవో నెంబరు70లో సమూలంగా మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యూఎస్ విజయనగరం జోనల్ అధ్యక్షుడు వి.రాములు, ఫెడరేషన్ పార్వతీపురం ఆర్టీసీ డిపో అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకుడు రెడ్డి వేణు, గిరిజన సంఘం నాయకుడు రంజిత్, ప్రజా సంఘాల నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘాల డైరీల ఆవిష్కరణ

పార్వతీపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల ఉద్యోగ సంఘాల నూతన ఆంగ్ల సంవత్సర డైరీ, క్యాలెండర్లను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆవిష్కరించారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయ చాంబర్‌లో పలు శాఖల ఉద్యోగ సంఘాల అధ్యక్షులు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రెవెన్యూ అసోసియేషన్, ఏపీ ఇరిగేషన్, రహ దారులు, భవనాల శాఖ, మున్సి పల్ ఎంప్లాయీస్ వర్క్ చార్జర్లు అసోసియేషనల్ డైరీలు, క్యాలెండర్‌లను ఆయన ఆవిష్కరించారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఏపీజీఏసీ అమరావతి రెవెన్యూ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి, ఏపీజేఏసీ అమరావతి, జనరల్ సెక్రటరీ డీజీ ప్రసాదరావు, జలవనరులశాఖ రాష్ట్ర జనరల్ సెక్రటరీ వి.గౌరునాయుడు, విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎం.ధనుంజయనాయుడు, ఉపాధ్యక్షుడు డి.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భామిని, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గురండి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. బిల్లుమడ, నులకజోడు, నేరడి, వడ్డంగి, లోహరజోల గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

● మక్కువ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మక్కువ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న వెంకటభైరిపురం, మక్కువ, శంబర, దుగ్గేరు 11 కేవీ ఫీడర్లకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ జోగినాయుడు తెలిపారు. త్రీఫేస్ సప్లయి ఉదయం నాలుగు గంటల నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఉంటుందని చెప్పారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

● కలెక్టర్ శ్యాంప్రసాద్

సీతానగరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ సూచించారు. మండలంలోని జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(ప్రతిభా జూనియర్ పాఠశాల)ని ఆయన గురువారం రాత్రి సందర్శించారు. పల్లె నిద్రలో భాగంగా ఆయన ఈ పాఠశాలను సందర్శించి, విద్యార్థుల చదువుపై ఆరా తీశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. భోజన శాలను పరిశీలించారు. విద్యార్థుల తో ముచ్చటిస్తూ వసతులపై అడిగి తెలుసుకున్నారు.

● జోగింపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను జిల్లా అగ్రికల్చర్ అధికారిణి బి.శ్యామల పల్లెనిద్రలో భాగంగా గురువారం సందర్శించారు. ఈసందర్భంగా భోజన, వసతి సదుపాయాలపై ఆరా తీశారు. ఎంపీడీవో పి.త్రివిక్రమరావు పాల్గొన్నారు.



విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరీక్షిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

పెదకుదమ వైపు గజరాజులు

గరుగుబిల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకి, సంతోషపురం పంచాయతీల్లో సంచరించిన గజరాజుల గుంపు గురువారం జియ్యమ్మవలస మండలం పెదకుదమ వైపు పయనమయ్యాయి. గత పది రోజులకు పైగా సుంకి పరిధిలో అధికంగా వరి, అరటి, పామాయిల్ పంటలతో పాటు టీ దుకాణాలు, వ్యవసాయ మోటార్లు, పైపులను ధ్వంసం చేశాయి. గజరాజుల గుంపు సంచారంతో గ్రామస్థుల్లో ఆందోళన నెలకొంది. ఏనుగుల సంచారంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. గత కొద్ది రోజుల కిందట జియ్యమ్మవలస మండలం చినకుదమ, పెదకుమద గ్రామాల్లో సంచరించి తదుపరి గిజబ, నందివానివలస మీదుగా సంతోషపురం, సుంకి ప్రాంతాల్లో సంచరించి రైతులను హడలెత్తించాయి. తిరిగి ఈ ప్రాంతానికి వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతుల్లో దిగులు నెలకొంది. గజరాజులు కారణంగా నష్టం వాటిల్లిన పంటలకు ప్రభుత్వం తగిన పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



పెదకుదమ వైపు పయనమైన ఏనుగుల గుంపు

ఆరోగ్య సమస్యలను సకాలంలో గుర్తించాలి

● వైద్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహన్‌రావు

గుమ్మలక్ష్మీపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యలను సకాలంలో గుర్తించాలని, మారుమూల గిరిజన గ్రామీణులకు అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు సూచించారు. మండలంలో ఇరిడి, లిక్కిడి, మండ, పి.ఆమిటి గ్రామాలను ఆయన గురువారం సందర్శించారు. గ్రామాల్లో ఆరోగ్య సర్వేలు ఏ మేరకు చేపడుతున్నారు, వ్యాధులను గుర్తించడం, చికిత్స, నివారణకు చర్యలు తదితర అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. ఆరోగ్య సర్వే రికార్డులు పరిశీలించారు. దీర్ఘకాలిక రోగుల పర్యవేక్షణ, కొత్తగా నమోదైన ఎన్‌సీడీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గృహ సందర్శనలు చేసి వృద్ధులు, గర్భిణులు, బాలింతలతో ఆయన మాట్లాడి వారి ఆరోగ్య స్థితిగతులను, అందుతున్న వైద్యసేవలపై తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువు, ఎత్తు పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. మారుమూల గ్రామాల ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, యర్రాయమ్మ, హెచ్ఎం పార్వతి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహన్‌రావు

ప్రశాంతంగా పీసా ఎన్నికలు

జియ్యమ్మవలస, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయతీ పొడిగింపు(పీసా) ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. మండలంలో పీసా వర్తించిన గోర్లి, పాండ్రసింగి, కొండచిలకాం, ద్రాక్షిణి, బల్లేరు, కొండనిడగళ్లు గ్రామాల్లో ఈ ఎన్నికలు నిర్వహించారు. 860 పురుషులు, 934 మంది మహిళలు, ఒక ట్రాన్స్‌జెండర్ ఈ గ్రామాల పరిధిలో ఓటర్లుగా ఉన్నారు. అన్ని చోట్లా ఎన్నికలు ప్రశాంతంగా, ఏకగ్రీవంగా జరిగినట్టు ఎంపీడీవో శంబంగి రమేష్ తెలిపారు. గురువారం ఆయన ఎన్నికలు జరిగిన గ్రామాల్లో పర్యటించారు. గ్రామసభ ఎన్నికలకు ఎన్నికల అధికారులుగా గోర్లి గ్రామానికి మండల ఇంజినీరింగ్ అధికారి ఎం.పార్థసాయి, పాండ్రసింగి గ్రామానికి మండల ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి వై.భరత్‌చంద్ర, కొండచిలకాం గ్రామానికి తహసీల్దార్ ఆర్.పకీరు, ద్రాక్షిణి గ్రామానికి మండల పరిషత్ సూపరింటెండెంట్ కె.రామారావు, బల్లేరు గ్రామానికి ఎంఈవో-2 ముదిలి శ్రీనివాసరావు, కొండనిడగళ్లు గ్రామానికి గ్రేడ్-2 హెచ్ఎం కేఏఎస్ కుమార్ వ్యవహరించారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

● సత్తా చాటిన పారాది విద్యార్థినులు



పోటీలకు బయలుదేరిన విద్యార్థినులతో పీడీ వెంకటనాయుడు

బొబ్బిలి రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారాది జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు పీడీ నల్ల వెంకటనాయుడు తెలిపారు. ఆయన గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మహారాష్ట్రలో ఈనెల 5 నుంచి 9 వరకు జరగబోయే అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు బెల్లాన సుప్రియ, భువనేశ్వరి; పాండిచ్చేరిలో 9 నుంచి 13వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొనేందుకు అల్లాడ తేజస్విని, చైతన్యకుమారి, దుర్గా, యమున, మౌనిక గురువారం బయలుదేరారని ఆయన చెప్పారు. ఈ విద్యార్థినులకు ఎమ్మెల్యే బేబీనాయన, అధ్యక్షుడు సుంకర సాయిరమేష్ తదితరులు అభినందనలు తెలిపారు.

రక్తహీనత నివారణపై దృష్టి సారించాలి

మక్కువ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రక్తహీనత నివారణపై దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి, మత్స్యశాఖ ఏడీ తిరుపతయ్య అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, ఐసీడీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, చిన్నారులు, బాలింతలు రక్తహీనత బారిన పడకుండా ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రక్తహీనత నివారణపై ప్రజలకు వివరించేలా కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డీడీ స్వరూపారాణి, ఈవోపీఆర్డీ పి.దేవకుమార్, మక్కువ, శంబర పీహెచ్‌సీల వైద్యాధికారులు నిఖిల, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మంత్రి



సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు/పార్వతీపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గురువారం సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలియజేసినట్టు ఆమె స్థానిక విలేకర్లకు తెలిపారు. గత సంవత్సరం రాష్ట్ర అభివృద్ధిని స్మరించుకుంటూ నూతన సంవత్సరంలో మరింత ప్రగతి సాధించేందుకు ఆయనకు శక్తి, ఆయుస్సు, ఆరోగ్యం ప్రసాదించాలని దేవుడిని కోరుకున్నట్టు ఆమె తెలిపారు.

లైఫ్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

బెలగాం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక రిటైర్డ్ ఎంప్లాయీస్ భవనంలో జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ ఆరిక మన్మథరావు గురువారం పెన్షన్‌దారులకు లైఫ్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించారని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గణపతిరావు తెలిపారు. గణపతిరావు విలేకర్లతో మాట్లాడుతూ వచ్చేనెల 28 వరకు కొనసాగే ఈ రిజిస్ట్రేషన్‌ను జిల్లాలోని పెన్షన్‌దారులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు మంచిపల్లి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

5న మెగా జాబ్ మేళా

సాలూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల ఐదో తేదీన మెగా జాబ్ మేళాను ప్రారంభిస్తున్నట్టు రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అనేక కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటున్నట్టు ఆమె చెప్పారు.

మోటార్ కార్మికుల సదస్సును విజయవంతం చేయండి

సాలూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లారీ ఓనర్స్ కార్యాలయంలో ఈనెల 4వ తేదీన మోటార్ కార్మికుల సమస్యలపై నిర్వహించబోయే సదస్సును విజయవంతం చేయాలని యూనియన్ నాయకులు ఎన్‌వై నాయుడు, కోట శ్రీనివాసరావు, బలరాం, శంకర్రావులు కోరారు. ఈసందర్భంగా గురువారం ది సాలూరు లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గుమ్మలక్ష్మీపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కందికొత్త పండగలో వేడి సాంబారు టబ్‌లో పడి గాయాలపాలై.. మృతిచెందిన చెముడుగూడ గ్రామానికి చెందిన రమేష్ కుటుంబానికి మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి ఆర్థిక సాయం చేశారు. మంగళవారం ఆమె రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.50వేలు సాయం అందజేశారు.

తోటపల్లి ఆలయ అభివృద్ధికి సహకరిస్తాం

గరుగుబిల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి ఆలయాల అభివృద్ధికి సహకరిస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ తెలిపారు. గురువారం ఆయన వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ అభివృద్ధి ట్రస్టీలో సభ్యత్వం తీసుకున్నారు. ఆలయ సమస్యలను దేవదాయశాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు.

నూతన బస్సులకు పూజలు

పాలకొండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పాలకొండ కోటదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో గురువారం మూడు నూతన ఆర్టీసీ బస్సులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1987 సంవత్సరం నుంచి ఈ ఆనవాయితీ వస్తుందని డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు తెలిపారు.